
సాక్షి గుంటూరు

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.




సుబ్బారాయుడి సేవలో..

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మదాయశాఖ అడిషనల్ కమిషనర్ కోడూరి రామచంద్ర మోహన్ సోమవారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

వావిలాల.. ఉద్యమ జ్వాల



వావిలాల గోపాలకృష్ణయ్య

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరంలో నేను సైతం అంటూ బ్రిటీష్ పాలకులను ఎదిరించిన వీరుడు వావిలాల గోపాలకృష్ణయ్య. ఆయనో ఉద్యమ జ్వాల. వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. జైలులో ప్రత్యక్ష నరకాన్ని చవి చూసి దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. 1906 సెప్టెంబర్ 17న సత్తెనపల్లిలో జన్మించిన వావిలాల యుక్తవయసులో మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టారు. జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్ర్య వచ్చాక వావిలాల ప్రజాసేవకే అంకితమయ్యారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికై తొలి శాసన సభ్యుడిగా సేవలందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు సార్లు జయకేతనం ఎగురవేశారు. ప్రజల కోసమే జీవించి 2003 ఏప్రిల్ 29న అనారోగ్యంతో కన్నుమూశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని చెరువు పక్కన ఏర్పాటైన వావిలాల ఘాట్ అభివృద్ధిపై గత పాలకులు శీత కన్నేశారు. దీంతో అప్పట్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి వావిలాల వర్ధంతి నిర్వహించారు. దీంతో అప్పటిపాలకులు ఆ ఘాట్‌కు ఎన్టీఆర్ గార్డెన్‌గా పేరుమార్చారు. దీనిపై స్థానికులు మండి పడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకొని ఆ ప్రాంతానికి వావిలాల స్మృతివనం (వావిలాల ఘాట్)గా నామకరణం చేయించి ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు.

ఐక్యతను చాటే త్రివర్ణపతాకం

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: త్రివర్ణ పతాకం ఐక్యతను చాటుతుందని, అందులోని మూడు రంగులు శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతకు చిహ్నమని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అధికారులకు, ప్రజలకు జాతీయ జెండాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపైనా, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. దేశ పౌరుల బంధాన్ని బలోపేతం చేసే శక్తి త్రివర్ణ పతాకానికి ఉందని కలెక్టర్ చెప్పారు. అనంతరం జాతీయ జెండాను అధికారులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ లలిత, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

నేడు పాఠశాలల్లో జాతీయ పతాక ఆవిష్కరణలు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఎగురవేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ కమిటీ చైర్మన్లు జెండాను ఆవిష్కరించాలని విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో శైలజ తెలిపారు. పేరెంట్ కమిటీ చైర్మన్లు అందుబాటులో లేని పక్షంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.

ఎస్ఈబీ ఆఫీసర్‌గా మహేష్‌కుమార్



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్‌గా సిహెచ్‌వి మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. తొలుత ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

స్వాతంత్ర్య పౌరుషం





1905లో బెంగాల్ విభజన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా వందేమాతరం ఉద్యమం సాగింది. 1907లో సూరత్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో అతివాద, మితవాద పక్షాలు ఏర్పడ్డాయి. 1908 వేసవిలో తెనాలిలో జరిగిన కృష్ణాజిల్లా కాంగ్రెస్ అసోసియేషన్ సమావేశం అతివాదులను బలపరిచింది. ఆనాటి చిత్రమిది.

పుల్లరి ఉద్యమం



'పుల్లరి' యోధుడు కన్నెగంటి హనుమంతు

అడవుల్లో పశువుల మేత కోసం పుల్లరి పన్ను చెల్లించకూడదనే ఉద్దేశంతో పల్నాడు ప్రజలు ఉద్యమించారు. ప్రభుత్వోద్యోగుల్ని సాంఘికంగా బహిష్కరించారు. ఈ సమయంలో మాచర్లకు వెళ్లిన ఉన్నవ లక్ష్మీనారాయణ, వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులుకు బ్రిటిష్ ప్రభుత్వం ఏడాది జైలుశిక్ష విధించింది. నిరసనగా గుంటూరులో వారంరోజులు హర్తాళ్ నిర్వహించారు. పల్నాడులో అటవీ శాసనోల్లంఘనాన్ని తీవ్రతరం చేశారు. 1921 సెప్టెంబరు 23న సాయుధ దళాలు అడవిలో మేపుతున్న పశువులను అడ్డుకుని బందెలదొడ్డికి తరలించారు. కోపోద్రిక్తులైన ప్రజలు రాళ్లవర్షం కురిపించారు. పోలీసు కాల్పుల్లో ఉద్యమనేత కన్నెగంటి హనుమంతు సహా ముగ్గురు మరణించారు.

ఉద్యమభేరి.. చైతన్యఝరి

స్వరాజ్యం నా జన్మహక్కు అంటూ బాలగంగాధర్ తిలక్ కంటే ముందే ఉమ్మడి గుంటూరు జిల్లా రణన్నినాదమై మార్మోగింది. నాగలి సమ్మెతో కదం తొక్కింది. బ్రిటిష్ సర్కారును గడగడలాడించింది. మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్ర్య సమరభేరి మోగించింది. సూర్యుడు అస్తమించని రాజ్య దురహంకారంపై గర్జించింది. అమర వీరుల రక్తంతో తడిసినా.. కడుపుకోతను దిగమింగి ఉక్కుపిడికిలెత్తి గోబ్యాక్ బ్రిటన్ అంటూ నినదించింది. జయ పతాకను రెపరెపలాడిస్తూ భారతావనికి జైకొట్టింది.

ఉమ్మడి గుంటూరు జిల్లా గర్జన

- బ్రిటిష్ సేనలను గడగడలాడించిన సమరయోధులు
- పోరుబాటన మేముసైతం అంటూ ముందుకురికిన మహిళామణులు
- సమరస్ఫూర్తి రగిలించిన గాంధీ

తెనాలి: స్వాతంత్ర్య సమరం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహోగ్రరూపం దాల్చింది. గ్రామగ్రామాన పౌరులు బ్రిటిష్ పాలకులపై గళమెత్తారు. బానిస సంకెళ్లను తెంచుకునేందుకు వీధుల్లోకి వచ్చి ఆగ్రహజ్వాలై రగిలారు. ఎందరో అసువులుబాసినా.. మరెందరో జైలుపాలైనా సడలని సంకల్పంతో ఉద్యమించారు. నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒళ్లు గగుర్పొడిచే ఆనాటి పోరాట ఘట్టాల సమాహారమిది..

కదంతొక్కిన కోటప్పకొండ

1909 ఫిబ్రవరి 18న కోటప్పకొండ తిరునాళ్లలో బ్రిటిష్ సేనల దాష్టీకానికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. అక్కడి పోలీసు ఠాణాను తగులబెట్టారు. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు చనిపోయారు. కొత్తరెడ్డిపాలెంకు చెందిన చిన్నపరెడ్డితో సహా 45 మందిని అరెస్టుచేశారు. చిన్నపరెడ్డికి ఉరిశిక్ష వేశారు. 1909లోనే బ్రిటిష్ వైస్రాయ్ ప్రయాణించనున్న రైలును పేల్చేందుకని కుట్రపన్నిన కేసులో తెనాలి సమీపంలోని కంచర్లపాలెంకు చెందిన చుక్కపల్లి రామయ్య, కఠెవరంవాసులు కోటంరాజు వెంకట్రాయుడు, లక్కరాజు బసవయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. రామయ్యకు పదేళ్లు, బసవయ్యకు ఐదేళ్ల ద్వీపాంతరవాస శిక్ష విధించారు.



కల్లూరి చంద్రమౌళి



ముత్తేవి మాధవాచార్య



షేక్ అబ్దుల్ వహాబ్



కల్లూరి తులశమ్మ



సూర్యదేవర రాజ్యలక్ష్మి



కొడాలి కమలమ్మ

స్వదేశీ ఉద్యమానికి శ్రీకారం

స్వదేశీ వస్తువులను మాత్రమే విక్రయించాలనే ఉద్యమానికి గుంటూరులో కొండా వెంకటప్పయ్య, వింజమూరి భావనాచారి నాయకత్వం వహించారు. మాంటేగ్–చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలపై 1918 ఆగస్టు 17న గుంటూరులో ఆంధ్ర మహాసభ కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశమైంది. కాంగ్రెస్ లీగ్ ఒడంబడికను అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది.

విద్యార్థుల తరగతుల బహిష్కరణ

హోమ్ రూల్ ఉద్యమంలో భాగంగా మచిలీపట్నంలో ఏర్పాటైన జాతీయ పాఠశాలకు వెళ్లి, శిక్షణ తీసుకున్నవారు. 1920లో తెనాలిలో జాతీయ పాఠశాలను ఆరంభించారు. జాతీయవాదులకు ఈ పాఠశాల ప్రేరణస్థావరంగా పనిచేసింది. 1920–21లో ప్రభుత్వం తన ఆధీనంలోని పాఠశాలలు, కాలేజీలను జాతీయ విద్యాసంస్థలుగా మార్పు చేయాలంటూ జరిగిన విద్యార్థుల ఆందోళనలో భాగంగా తెనాలిలో తాలూకా హైస్కూలు విద్యార్థులు 1,050 మంది వారంరోజులు తరగతులను బహిష్కరించారు. ఫలితంగా అదే ఏడాది 44 జాతీయ పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

పదవులకు రాజీనామా

సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వానికి కొండా వెంకటప్పయ్య రాజీనామా చేశారు. రాష్ట్రంలో నలుగురు ప్రముఖులు గౌరవ మేజిస్ట్రేట్ పదవులకు రాజీమా చేయగా అందులో మౌల్వీ మొహమ్మద్ రజాసాహెబ్, ఏలూరు హనుమంతరావు జిల్లాకు చెందినవారు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

1920 సెప్టెంబరు 28న గుంటూరు బార్ అసోసియేషన్ చేసిన తీర్మానంతో న్యాయవాదులు 11 నెలలు విధులను బహిష్కరించారు. అయ్యదేవర కాళేశ్వరరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, మాడభూషి నరసింహాచార్యులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి పలువురు న్యాయవాద వృత్తిని నిలిపివేశారు. జిల్లాలోని కరణాలు, మునసబులు 16 మంది రాజీనామా చేశారు. రేపల్లెలో 8 మంది, నరసరావుపేటలో ఆరుగురు కౌన్సిలర్లు సభ్యత్వాలను వదులుకున్నారు.


అమరులైన ఏడుగురు

1942లో జరిగిన క్విట్‌ఇండియా ఉద్యమంలో తెనాలిలో హింస ప్రజ్వరిల్లింది. సాయుధ బలగాల కాల్పుల్లో ఏడుగురు అమరులయ్యారు. తర్వాతి రోజు గుంటూరు గాంధీపార్కులో రెండువేల మంది ప్రజలు సమావేశమయ్యారు. పోలీసుల కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. కాంగ్రెస్‌పై నిషేధం కారణంగా 1945లో ఏలూరులో అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షతన కాంగ్రెస్‌వాదులు సమావేశమై ఆంధ్ర అసెంబ్లీ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారు. తెనాలి నేత కల్లూరి చంద్రమౌళిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కల్లూరి తులశమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మి, కొడాలి కమలమ్మ వంటి వనితా యోధులూ పోరుబాట పట్టారు.

కొండా వెంకటప్పయ్య నేతృత్వం



త్రిపురనేని రామస్వామి



కొండా వెంకటప్పయ్య

1923లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షుడిగా కొండా వెంకటప్పయ్య నియమితులయ్యారు. 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషను వచ్చినపుడు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో భాగంగా తెనాలిలో బహిష్కరణ ఉచ్చస్థితిలో నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహంలోనూ జిల్లానుంచి వందలమంది పాల్గొన్నారు. జైలుశిక్షను అనుభవించారు. జిల్లాలో ఉద్యమానికి కొండా వెంకటప్పయ్య, నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు, శరణు రామస్వామి చౌదరి నాయకత్వం వహించారు. హేతువాద ఉద్యమ ప్రముఖుడు త్రిపురనేని రామస్వామి, 'వీరగంధం తెచ్చినారము.. వీరులెవ్వరో తెల్పుడీ' గేయంతో ఉత్తేజాన్ని కల్పించారు. 1941లో సత్యాగ్రహంలో పాల్గొన్న వావిలాల గోపాలకృష్ణయ్య, కల్లూరి చంద్రమౌళి, భారతీదేవి రంగాను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది.


పన్నుల చెల్లింపు నిరాకరణ



పర్వతనేని వీరయ్యచౌదరి


1922లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పన్నుల నిరాకరణ తీర్మానాన్ని జిల్లాలో, ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కా అమలుచేసింది. ఇక్కడ అన్ని గ్రామాల్లోని కరణాలు, మునసబులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ 'శాంతిసేన' సైనికులు ప్రభుత్వంపై నిరాదరణ, సహాయనిరాకరణ తీవ్రంచేశారు. అణచివేతను బ్రిటిష్ ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టర్ రూదర్‌ఫర్డ్‌కు అప్పగించింది. ఆస్తుల జప్తుకు పూనుకున్నా సాధ్యపడకుండా పర్వతనేని వీరయ్యచౌదరి, చిత్రవిచిత్రమైన వ్యూహాలతో ప్రజలు, శాంతిసేన సైనికులను నడిపించారు.

నాగలి కన్నెర్ర



1857లో జరిగిన భారత ప్రథమ స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే జిల్లాలోని నాదెండ్ల సమితిలో నాగలి సమ్మె జరిగింది. అప్పట్లో కృష్ణాజిల్లాలో ఉన్న గుంటూరు ప్రాంతంలో కరువు తాండవించింది. పన్ను బకాయిల వసూళ్ల కోసం ఆస్తుల జప్తునకు బ్రిటిష్ పాలకులు సిద్ధపడ్డారు. తిరగబడిన రైతులు నాగలి, గొర్రు, గుంటక, పలుగు, పార మంచెపై పెట్టి వ్యవసాయం మానేసి, చేతిపనివారితో సహా సమ్మె చేశారు. పాలకులు దిగొచ్చి పన్నులను రద్దు చేశారు. గ్రామీణ శ్రామిక జనాలు సమైక్యంగా పోరాడిన తొలి సంగ్రామ ఘట్టమిది.

సీఐ వాసుకు ఇండియన్ పోలీస్ మెడల్



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): దేశ సరిహద్దులో మండే ఎండ.. ఎముకలు కొరికే చలి.. వర్షాన్ని లెక్క చేయకుండా సేవలందించిన జవాన్ ఆయన.. ఆర్మీ నుంచి వచ్చిన తరువాత ప్రజా సేవ చేయాలనే తలంపుతో పోలీసు శాఖలో ఎస్ఐగా చేరారు. ఎన్నో కేసులు ఛేదించారు.. మరెన్నో అవార్డులు తీసుకున్నారు. ఆయనే మేడికొండూరు సీఐ కె.వాసు. ఆయన విశేష పని తీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)కు ఎంపిక చేసింది.

ఇదీ ప్రస్థానం..

1998లో ఆర్మీలో చేరిన వాసు కాశ్మీర్, పంజాబ్, గుజరాత్‌తోపాటు పలు ప్రాంతాల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో పనిచేశారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పోరాడారు. బీఎస్ఎఫ్ నుంచి బయటకు వచ్చిన ఆయన 2004లో ఆర్మ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) ఎస్ఐగా ఎంపికయ్యారు. ఏడేళ్ల పాటు యాంటీ నక్సల్ స్క్వాడ్ (ఏఎన్ఎస్)లో పని చేసి 2011లో కఠిన సేవా పతకం పొందారు. 2014లో సివిల్ పోలీసు విభాగానికి కన్వర్ట్ అయిన వాసుకు 2021లో సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. గుంటూరు జిల్లాలో సెల్‌ఫోన్ కంటైనర్ చోరీ చేసిన మధ్యప్రదేశ్ ఖంబిర్‌భట్‌కు చెందిన దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో వాసు ప్రతిభ కనబరిచి డీజీపీ నుంచి మెడల్‌ను పొందారు. బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకోవటంతోపాటు, అతనికి ఉరిశిక్ష పడేందుకు పాటుపడ్డారు. దీనికి కేంద్రహోం శాఖ మంత్రి నుంచి అవార్డు పొందారు. అంత్రిక్ సురక్ష సేవా పతకం, ఉత్రిక్ష సేవా పతకం, ఏబీసీడీ అవార్డు వంటివి అందుకున్నారు. తాజాగా ఉత్తమ సేవల విభాగంలో ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఐ కె.వాసు మాట్లాడుతూ ఐపీఎం అవార్డుకు ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

టీడీపీ ఆప'షో'పాలు

- పార్టీ కండువా కప్పుకుంటే రూ.వెయ్యి
- దుస్తులు, మందు, బిర్యానీ ఉచితం
- చేర్పించినవారికీ ప్యాకేజ్
- లోకేష్ యాత్ర కోసం నేతల అవస్థలు



మంగళగిరి: లోకేష్ యాత్ర కోసం తెలుగుదేశం నేతలు ఆపసోపాలు పడుతున్నారు. యాత్ర సందర్భంగా భారీగా చేరికలు ఉన్నట్లు చూపించడం కోసం భారీగా నగదు ఖర్చుచేస్తున్నారు. పార్టీలో చేరిన వారికి ఒక ప్యాకేజి, చేర్పిన వారికి మరో ప్యాకేజి ఇవ్వజూపుతున్నారు. వంద మందిని చేరిస్తే ఒక ధర ఇంకా ఎక్కువ మందిని చేరిస్తే మరో రేటు ఇచ్చి లోకేష్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పించాలని అధినేత నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో బాగానే సంపాదించుకున్నారు కదా.. ఖర్చు పెట్టాల్సిందేనని అధిష్టానం నుంచి ఒత్తిడి రావడంతో పార్టీ నేతలు మింగలేక కక్కలేక అవస్థలు పడుతున్నారు.

మూడువేల మందిని చేర్చాలని బాబు హుకుం

సోమవారం రాత్రి మంగళగిరి నియోజకవర్గంలోకి లోకేష్ యాత్ర ప్రవేశించనుండడంతో ప్రస్తుతం ఉన్న నాయకులు, కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. తొలిరోజే మూడువేల మందిని పార్టీలో చేర్చాలని చంద్రబాబు నేతలకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. గతంలో రెండుమూడుసార్లు రత్నాలచెరువు ఎస్టీకాలనీ నుంచి పలువురిని డబ్బులు ఇచ్చి పార్టీలో చేర్పించారు. ఈ చేరికల సందర్భంగా ఆర్థికంగా లబ్ధిపొందిన తెలుగుదేశం లీగల్ విభాగానికి చెందిన వ్యక్తితోపాటు గతంలో టీడీపీ కార్యాలయంలో పనిచేసి తొలగించబడిన మరో కార్యకర్త ప్రస్తుతం ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాజీ ఇన్‌చార్జ్ పోతినేని శ్రీనివాసరావుతో సహా పలువురు నేతలు చేతులెత్తేయగా మరికొందరు లక్ష్యాలు విధించడంతో ఇదెక్కడి ఖర్మరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యర్రబ్రాలెంకు చెందిన రెండువర్గాల నేతలకు ఐదు వందల మందిని చేర్చాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. కురగల్లు, నిడమర్రు, బేతపూడి, పెదవడ్లపూడి నేతలకూ ఇలాగే టార్గెట్లు పెట్టినట్టు సమాచారం.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలంటూ.. దుష్ప్రచారం

గతంలో ఎన్నడూ వైఎస్సార్ సీపీలో లేని వారిని తీసుకొచ్చి ఆ పార్టీ కార్యకర్తలుగా పరిచయం చేసి టీడీపీలో చేర్చుకుంటుండడంతో టీడీపీ కార్యకర్తలే ఆశ్చర్యపోతున్నారు. గతంలోనే టీడీపీ కండువా కప్పుకున్నవారు ఇప్పుడు పెద్దమొత్తంలో ఇస్తే మళ్లీ కప్పుకుంటామని చెప్పడంతో టీడీపీ నేతలు అవసరమైతే రెండుమూడురెట్లు అదనంగా ఇస్తుండడం చర్చనీయాంశమవుతోంది. నేరుగా లోకేష్ అనుచరులే రంగంలోకి దిగి పార్టీ కండువా కప్పుకుంటే రూ.వెయ్యి, బిర్యాని ప్యాకెట్, మద్యం పంపిణీ చేసేలా ఒప్పందం చేసుకున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌కే ఓటు!

మంగళగిరి ఎస్టీ కాలనీకి చెందిన పలువురు మాట్లాడుతూ ఇప్పటికే తాము లోకేష్‌తో రెండు సార్లు పార్టీ కండువా కప్పించుకున్నామని, రూ.వెయ్యి చొప్పున ఇచ్చారని, మళ్లీ చేరాలని టీడీపీ నేతలు కోరారని చెప్పారు. కాలనీ నుంచి సుమారు 150 మంది రావాలన్నారని, రూ.వెయ్యి, బిర్యాని, మద్యం ఇస్తామన్నారని పేర్కొన్నారు. కృష్ణాయపాలెం నుంచి గతంలో ఎస్సీ,ఎస్టీ కేసులు ఎదుర్కొన్న వారిని రైతులుగా చూపి వారిని పార్టీలో చేర్చి ఎస్సీలతో లోకేష్ ముందు మాట్లాడించేందుకు టీడీపీ నేతలు యత్నిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆర్కే, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని స్థానికులు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా పలువురు లోకేష్‌తో కండువా కప్పించుకున్నా.. చివరకు ఎన్నికల్లో ఫ్యాన్‌కే ఓటేస్తామని, ఇప్పుడు వచ్చే డబ్బులను ఎందుకు వదులుకోవాలని ప్రశ్నిస్తుండడం కొసమెరుపు.

క్లుప్తంగా

సచివాలయాలతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు పొందే హక్కు ప్రజలకుందని, వాటిని గ్రామస్థాయికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్ని ఏర్పాటు చేసిందని వివరించారు. సిబ్బందికి కూడా ప్రజల సమస్యలపై మరింత చురుగ్గా వ్యవహరించాలని ఆయన సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం స్పందనకు ఎక్కువగా వస్తున్నారన్నారు. ప్రతి సచివాలయంలోనూ స్పందన అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు అక్కడే ఇవ్వాలని తెలిపారు. అనంతరం వచ్చిన 173 అర్జీలను కలెక్టర్, జేసీ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ లలిత, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

సమస్యపై జేసీ సానుకూల స్పందన

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న నా భూమి- నాదేశం, నేల తల్లికి వందన కార్యక్రమాలకు గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలా ఫలకాలపై సర్పంచ్ పేరుండాలని జేసీ రాజకుమారికి వినతిపత్రం అందజేశాం. ఆమె వెంటనే అధికారుల్ని పిలిచి సమస్య పరిష్కరించారు. జేసీకి కృతజ్ఞతలు.

–డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, అఖిల భారత పంచాతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు

నకిలీ దంత వైద్యులపై చర్యలు తీసుకోండి

స్పందనలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఫిర్యాదు



బాధితుల సమస్య వింటున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: గుంటూరు పరిసర ప్రాంతాల్లో తిష్ట వేసిన నకిలీ దంత వైద్యులపై చర్యలు చేపట్టాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలోని స్పందన హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

అనుమతులు లేకుండా దంత చికిత్సలు

గుంటూరు నగర, పరిసరాల్లో నకిలీ దంత వైద్యులు రోగులకు చికిత్స అందిస్తున్నారు. వీరిలో గతంలో దంత వైద్యుల వద్ద సహాయకులుగా, చైర్ అసిస్టెంట్లుగా పనిచేసిన వారే ఎక్కువ. దంత వైద్యులకు తప్పనిసరిగా బీడీఎస్ అర్హతతో పాటు రాష్ట్ర దంత కౌన్సిల్ (ఎస్‌డీసీ)లో పేరు, డీఎంహెచ్‌వో అనుమతులు ఉండాలి. రిజిస్టర్ నంబర్ ఉండాలి. ఇవేమి లేకుండా రోగులకు పలువురు దంత వైద్యసేవలు అందిస్తున్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న నకిలీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా..

– ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎం.రాఘవేంద్రబాబు, గుంటూరు

మెడలో చెప్పులతో నిరసన

రెండేళ్ల కిందట నా ఫోన్ హ్యాక్ గురై, తెలిసిన ఓ వ్యక్తి లక్షలాది రూపాయలు కాజేశాడు. స్థానిక పోలీసులకు అతనిపై ఫిర్యాదు చేయగా, తగిన సెక్షన్లు నమోదు చేయలేదు. అదిగాక కుటుంబ సభ్యుల్లో ఒకరి ఫొటోలు అసభ్యకరంగా పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తానని ఓ లాయర్ రూ.6 లక్షలు తీసుకున్నాడు. అంతేగాక తెలంగాణలో ఓ మహిళ మోసగించి రూ.2 కోట్ల వరకు కాజేసింది. ఆయా ఫిర్యాదులపై ఇప్పటి వరకు నాకు న్యాయం జరగలేదు. జరిగే వరకు మెడలో చెప్పులు ధరించి తిరుగతాను.

– బి.కోటేష్, పెట్రోల్ బంక్ యాజమాని, నవులూరు, మంగళగిరి

దేశ విభజనపై ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

లక్ష్మీపురం: దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలపై గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్య పోరాటం గురించి వివరిస్తూ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చే ముందు రోజు 14న దేశ విభజన సందర్భంగా చోటు చేసుకున్న అవాంఛనీయ ఘటనలపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల జీవిత చరిత్రల గురించి తెలుసుకునేందుకు ప్రదర్శన దోహదపడుతుందని తెలిపారు.

సోమవారం ఉదయం యర్రబాలేనికి చెందిన పాశం లక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఉదయం 6 గంటలకే ఎయిమ్స్ ఆసుపత్రికి చేరుకుంది. ముందుగా సిబ్బంది టోకెన్ ఇవ్వకుండా అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఫోన్ లేదని చెప్పడంతో పక్కన కూర్చోమన్నారు. మధ్యాహ్నం 11 గంటలయినా సిబ్బంది ఆమెను పట్టించుకోలేదు. రిసెప్షన్‌లో అడిగితే కసురుకోవడంతో వృద్ధురాలిలో ఓపిక నశించింది. బంధువులకు ఫోన్ చేసి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు వారిలో బైటాయించింది. మధ్యాహ్నం 12 గంటలకు మెడికల్ సూపరింటెండెంట్ వచ్చి ఆమెను బతిమాలి లోపలికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించారు.



ఆందోళనకు దిగిన పాశం లక్ష్మమ్మతో మాట్లాడుతున్న ఎయిమ్స్ అధికారులు



విజయవాడకు చెందిన ప్రసాద్ కాలికి ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఎయిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. వీల్‌ఛైర్ లేక నరకయాతన పడుతూ రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది.

‘ఎయిమ్’లెస్‌తో రోగులకు నరకం



ఓపీ వద్ద వేచిఉన్న రోగులు



మందుల దుకాణం వద్ద కిటకిట

- సమాచారం ఇచ్చే వారు కరువు
- రోగుల సహనాన్ని పరీక్షిస్తున్న ఎయిమ్స్ సిబ్బంది
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- సహనం నశించి ఆందోళనకు దిగిన వృద్ధురాలు

మంగళగిరి: పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్) సిబ్బంది, వైద్యుల తీరుతో రోగులకు నరకం కన్పిస్తోంది. సమయానికి హాజరుకాని సిబ్బంది, వైద్యులు వ్యవహరిస్తున్న తీరుతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ఏ సేవలు అందిస్తారో రోగులకు కనీస సమాచారం ఇచ్చే నాథుడు లేకపోవడంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కష్టాలు తప్పడం లేదు. రోగి ఆసుపత్రికి వెళ్లిన అనంతరం ఫోన్‌లో అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పించేవారు లేరు. ఆధార్ కార్డు లేకపోతే వెనక్కి వెళ్లాల్సిందే. ఫోన్ లేని రోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఓపీ క్యూలో నుంచుని నంబర్ తీసుకోవడానికే నాలుగు, ఐదు గంటల సమయం పడుతుండడంతో రోగుల్లో ఓపిక నశిస్తోంది. గత్యంతరం లేక వెనక్కి వెళ్లిపోయి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ అప్పులు పాలవుతున్నారు. సిబ్బందిలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బంధువులు లేదా డబ్బులు ఇచ్చిన వారిని ముందు పంపుతుండడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందితోనూ వాగ్వివాదానికి దిగుతుండటం సర్వసాధారణంగా మారింది. రోగుల బాధల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం శోచనీయం.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. దీని కోసం ఫోన్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం.

– డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, ఎయిమ్స్ డైరెక్టర్

రాజధాని గురించి మాట్లాడే అర్హత లోకేష్, శ్రీదేవికి లేదు

ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి, సురేష్ కుమార్

తాడికొండ: అమరావతి రాజధాని అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత నారా లోకేష్, ఉండవల్లి శ్రీదేవికి లేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఖండించారు. గుంటూరు భారత్‌పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజధానిపై నారా లోకేష్, ఉండవల్లి శ్రీదేవి అవగాహన లేకుండా, మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజధానిపై ప్రభుత్వం పూర్తి క్లారిటీలో ఉందని, అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధి చెందాలన్నదే లక్ష్యమని తెలిపారు. రాజకీయాలు హుందాగా ఉండాలి గానీ, అమరావతిని పట్టుకొని రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. రాజధాని రాకముందే చంద్రబాబు, ఆయన అనుచరులు ఈ ప్రాంతంలో భూములు కొన్నారని ఆరోపించారు. ముందస్తు వ్యూహమా లేక ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసేందుకా ? అని ప్రశ్నించారు. ఏ ఉద్దేశంతో ఈ పని చేశారో వారు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి శ్రీదేవికి పార్టీలో సముచిత స్థానం కల్పించామని, కానీ ఆమె జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుందని తెలిపారు. శ్రీదేవి అవినీతికి కేరాఫ్ అని, ఏ ఊరు వెళ్లినా, ఎవరిని పలకరించినా ఆమె వ్యక్తిత్వం గురించి చెబుతారన్నారు. అలాంటి శ్రీదేవి పార్టీపై నిందలు మోపడం సరికాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ టీడీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అలాంటిది రావెలలో జరిగిన సభలో ఆయన్ను అవమానించారని, సముచిత స్థానం కూడా ఇవ్వలేదని తెలిపారు. పార్టీకి పనిచేసిన వ్యక్తిని పక్కన బెట్టి వైఎస్సార్ సీపీ బహిష్కృత నేత శ్రీదేవిని వేదికపై కూర్చోబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధిలో చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డికి సాటి రారని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు పేద ప్రజల కోసం ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వ విధానాన్ని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు జరగని సంక్షేమం ఏపీలో అమలువుతోందని తెలిపారు. సమావేశంలో తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, కంతేరు సర్పంచ్ బెజ్జం మహేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జెజ్జం సాయి ప్రసాద్, కుక్కమళ్ల జగన్, వెంకటరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- రూ.16.50 లక్షల సొత్తు, విదేశాల కరెన్సీ స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గడిచిన రెండు నెలల్లో జరిగిన తొమ్మిది కేసుల్లో రూ.16.50 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, మరో కేసులో విదేశాల కరెన్సీ సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాల్ని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ వెల్లడించారు. గత రెండు నెలలో మంగళగి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజా, చినకాకాని, ఎర్రబాలెం గ్రామాల్లో, ఎన్నారై జంక్షన్ వద్ద తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. వరుస చోరీల్ని కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్, గుంటూరు సీసీఎస్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి జల్లెడ పట్టారు. అందులో ఓ పాత నేరస్తుడి వేలిముద్రలు సరిపోవడంతో ఆ దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం గౌరవరం గ్రామవాసి తోట శివకుమార్ అలియాస్ శివ భవాని, విజయవాడ పాయకాపురం సింగ్‌నగర్‌లో ఉంటున్న మంగళగిరి రత్నాలచెరువు 13వ వీధికి చెందిన వెంగళ భవానీశంకర్, విశాఖపట్నం మురళీనగర్ లాస్ట్ బస్టాప్‌కు చెందిన లాలం లోకేశ్వరరావు, మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్న వనం శివనాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. తొమ్మిది చోరీ కేసుల్లో రూ.16.50 లక్షల విలువ చేసే 294 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి, రూ.75 వేలు, సామర్లకోట పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో విదేశాల కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసుల్ని త్వరితగతిన ఛేదించిన ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఉత్తర డీఎస్పీ రాంబాబు, మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ వి.భూషణం, ఎస్ఐలు బి.జగన్‌మోహన్‌రావు, జె.క్రాంతికిరణ్, వి.బాబూరావు (సీసీఎస్), పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పిపి.వావ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వావ

పాత గుంటూరు: సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావ తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమంపై నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, సఫాయి కర్మచారి సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సఫాయి కార్మికులతో ప్రమాదకరంగా ఓపెన్ డ్రైయిన్లలో పనులు చేయించరాదని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించి, ప్రీమియం కూడా నగరపాలక సంస్థ చెల్లించడం అభినందనీయమన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.17 లక్షల వరకు పరిహారం అందుతుందని ఆయన తెలిపారు. మరో 15 రోజుల్లో ప్రతి కార్మికుడికీ పీఎఫ్,ఈఎస్ఐ నంబర్‌తో ఐడీ కార్డులు కూడా అందించాలని నగరపాలక సంస్థ అధికారుల్ని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ పెద్ది రోజా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి గురువారం గ్రీవెన్స్ జరుపుతున్నామని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సోమి శంకరరావు, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.మధుబాబు, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ముత్యాలరావు, పారిశుద్ధ్య పనివారల సంఘం అధ్యక్షుడు మరియన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.మాల్యాద్రి పాల్గొన్నారు.